క్లుప్తంగా

హనుమాన్ జయంతి, ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించే ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం హనుమాన్ దేవాలయం కమిటీ సభ్యులు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, శ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, రామ్‌చందర్ సింగ్, వెంకటయ్య, బాల్‌సాయిలు, ప్రవీణ్, రమేష్, బాల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి నిర్వహణపై సమీక్ష



మన్ననూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు ఎల్లస్వామి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి నిర్వాహణపై చర్చించారు. భవిష్యత్ కార్యచరణపై సమీక్షించారు. ఈ నెల 27న నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఎల్లస్వామి తెలిపారు. కుల, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు

పెద్దకొత్తపల్లి: మండలంలో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం చెరువుకట్టలపై కంపచెట్ల తొలగింపు, భూమి అభివృద్ధి పనులను చేపట్టినట్టు ఏపీఓ వెంకటేష్ తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 1100 మంది లేబర్లు పనిచే స్తున్నారని పేర్కొన్నారు. కొత్తగా పనులకు వచ్చి కూలీలు జాబ్‌కార్డులు పొందాలని సూచించారు.

నీటి వినియోగంపై అవగాహన



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ మాట్లాడారు. వేసవిలో నీటి నిర్వహణ పద్ధతుల గూర్చి వివరించారు. వర్షపునీటిని ఏ విధంగా ఒడిసిపట్టాలో తెలిపారు. నీటి కాలుష్యాన్ని నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సదస్సులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోష్‌కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వాల్మీకి మండల కమిటీ ఎన్నిక

లింగాల: మండల కేంద్రంలోని కొత్తకుంటపల్లిలో బుధవారం వాల్మీకి సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జుల బక్కయ్య, ఉపాధ్యక్షుడిగా గుజ్జుల రాముడు, ప్రధాన కార్యదర్శిగా గోద శంకర్, కోశాధికారిగా గోద చంద్రయ్య, కార్యదర్శులు మల్లేష్, మండ్ల శంకర్, స్వామి, ప్రధాన కోశాధికారిగా కృష్ణ, సలహాదారులుగా శ్రీశైలం, శ్రీను, వెంకటేష్, మహేష్, మండ్ల మల్లేష్, రవీందర్‌లు ఎన్నికయ్యారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



బల్మూర్: మండలంలోని మహాదేవ్‌పూర్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన సునీల్‌రెడ్డి మొదటి బహుమతిగా రూ. 60,000, ద్వితీయ బహుమతిగా రూ. 40వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 13 రోజులపాటు పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్, రమేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, మాడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ భాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. రెండు సెంటర్లలో 250 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



వెల్దండలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సబ్సిడీపై మంజూరైన 30 యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడు, పర్వత్‌రెడ్డి, ఎర్ర శ్రీనుముదిరాజ్, నారాయణ, లక్ష్మయ్య, రషీద్, పుల్లయ్య, హమీద్, తిరుపతిరెడ్డి, మల్లేష్, కొండల్, రాజశేఖర్, భరత్‌గౌడు, హౌజింగ్ ఈడీ సంగప్ప, డీఈఈ హరినాయక్, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి గిరి, ఏఓ శోభారాణి ఉన్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్

కల్వకుర్తి: ప్రభుత్వ ఆధ్వర్యంలో పట్టణంలో ముస్లింలకు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తహసీల్దార్ ఇబ్రహీం, ముస్లింలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గాల పరిశీలన

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని పలు ఈద్గాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కల్వకుర్తి మండలానికి చెందిన 45 మందికి, వెల్దండ మండలానికి చెందిన 60 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తహసీల్దార్లు ఇబ్రహీం, కార్తీక్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పోషకాహారంతో ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆవరణలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిక్షయ్ శివిర్ వందరోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం, జిల్లా టీబీ అధికారి రాజశేఖర్, నాట్కో సంస్థ ప్రతినిధి డా. మదన్ మోహన్, డా. బ్లేసీ, సీహెచ్‌ఓ శ్రీనివాస్, సిబ్బంది వినయ్, ఆరీఫ్, శ్రీను పాల్గొన్నారు.

వచ్చే నెల నుంచి సన్నబియ్యం పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ జేకే మోహన్

వెల్దండ: వచ్చే నెల నుంచి రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్ల బాధ్యతగా పనిచేస్తు ప్రజలకు సన్నబియ్యంను పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోని మొత్తం 37 రేషన్‌దుకాణాల్లో ప్రస్తుతం బియ్యం కోట వివరాలను అందించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు జంగయ్య, తదితరులు ఉన్నారు.

రేషన్‌డీలర్లతో సమావేశం

పెద్దకొత్తపల్లి: ఉగాది పండుగ నుంచి రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ జేకే మోహన్ తెలిపారు. బుధవారం మండలంలోని రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కొత్తగా వచ్చిన రేషన్ కార్డుల జాబితాను తయారుచేసి డీలర్లు తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు. ఎలాంటి అక్రమాలు చోటు చేసుకున్న కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ రమేష్ నాయక్, అదనపు గిర్దావరి శివకృష్ణ రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు



వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రేషన్‌షాపు 1, 2, 3, 4లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ దీపిక తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం షాపుల్లో నిల్వ ఉన్న రేషన్ బియ్యం, ఈ పాస్ మిషన్‌లో ఉన్న నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం వచ్చే నెల నుంచి అందించే సన్నబియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధమైందన్నారు. ప్రస్తుతం షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డుబియ్యంను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు జంగయ్య, రేషన్ డీలర్లు ఉన్నారు.

అప్పాజిపల్లి రైతుకు ప్రకృతి రత్న అవార్డు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లికి చెందిన రైతు మండ్ల కృష్ణయ్యకు ప్రకృతి రత్న అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచి ప్రోలులో మంగళవారం అవార్డును అందుకున్నారు. వ్యవసాయ పొలంలో గో ఆధారిత వ్యవసాయం చేస్తున్నందుకు అవార్డుకు ఎంపికైనట్లు కృష్ణయ్య తెలిపారు. బుధవారం అవార్డు గ్రహీత రైతు కృష్ణయ్యకు రైతులు, నాయకులు అభినందనలు తెలిపారు.

ఘనంగా సరస్వతి పూజ

తాడూరు: మండలంలోని ఐతోలు ప్రాథమిక పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఆంజనేయులు ప్రారంభించారు. అనురాధ, జాన్సి, వీరేష్, నరసింహరెడ్డి, పూజారి హరికృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కొల్లాపూర్ రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ నిరంజన్ రావు అన్నారు. బుధవారం మండలంలోని ఎన్మన్‌బెట్లలో మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరు అయిన సీసీ రోడ్లకు మాజీ సర్పంచ్‌లు మేకల నాగరాజు, పాశం నాగరాజుతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు గ్రామ అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. వెంకటేష్, బాస్కర్, పరశురాం, చిన్న వెంకటయ్య, గనాల వెంకటయ్య, రాజు, రామస్వామి, పెద్ద మల్లయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

తెలకపల్లి: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సీఎల్ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అంజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద 8, 9, 10 మెరిట్ విద్యార్థులకు దాసిపల్లి గ్రామానికి చెందిన సిగ్మా మైక్రో సిస్టమ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఎల్ఆర్ విద్యాసంస్థల సభ్యుడు సీమల దామోదర్ రెడ్డి సమకూర్చిన నగదును ఆయన పంపిణీ చేశారు. మండలంలో వివిధ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 మెరిట్ విద్యార్థులకు 3 నెలలకు సంబంధించి రూ.56 వేల నగదును అందజేశారు. హెచ్ఎం పద్మలత రెడ్డి, ఉపాధ్యాయులు ఆనంద్, విజయ్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందించాలి

అచ్చంపేట రూరల్: గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆర్మాన్ స్వచ్ఛంద సంస్థ శిక్షకురాలు డాక్టర్ శిరీష కోరారు. బుధవారం అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో ఆర్మాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదర, మన్ననూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఏఎన్ఎంలు, పర్యవేక్షణ సిబ్బందికి హైరిస్క్ గర్భవతుల ప్రోటోకాల్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్మాన్ స్వచ్ఛంద సంస్థ మాత శిశు మరణాలను తగ్గించాలనే ఆశయంతో పనిచేస్తుందన్నారు. గర్భిణులకు ఆరోగ్య స్థితి, ఏమైనా అనుమానాలు ఉంటే 02250323336కు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపిస్తే వెంటనే సందేహాలు నివృత్తి చేస్తామన్నారు. ఐటీ మేనేజర్ భాస్కర్, కార్తీక్, సుధాకర్, పవన్, సందీప్‌రావు, నిరంజన్, బిక్కులాల్, మంగమ్మ, శాంతాబాయి, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా అటవీశాఖ అధికారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలోని ఎఫ్‌డీఓ కార్యాలయం ఆవరణలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నసీర్‌సాబ్, ఖాదర్, రషీద్, రహీం, ఇస్మాయిల్, ఖలీముల్లా, షకీల్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

తిమ్మాజిపేట: సబ్సిడీపై ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు అందజేస్తుందని ఏఓ కమల్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అనుబ్యాటరీ, స్ప్రెయర్, 5 పవర్ స్ప్రెయర్లు, రెండు రోటోవేటర్లు, మూడు కల్టివేటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. భూమి పాసు బుక్కు, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ ఉన్న వారు ఏఈఓల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లిలో దుందుబీ నది నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. బుధవారం పోలీసులు గమనించి ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యజమాని రమణ గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు

రూ.3.52 లక్షలకు మేకల సంత వేలం



చారకొండ: మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే గొర్రెల, మేకల సంతకు 2025–26 సంవత్సరానికి మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి గణేష్ ఆధ్వర్యంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు వేలంలో హాజరుకాగా చింతపల్లి సత్యం రూ.3.52 లక్షలకు మేకల సంత దక్కించుకున్నాడు. ఒక సంవత్సరం పాటు సంత నిర్వహణ, వసూలు చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

వెల్దండ: మండలంలోని శివునిగుట్టపై ఉన్న మైసమ్మ దేవాలయానికి సంబంధించిన గుండును కొందరు దుండగులు ధ్వంసం చేసేందుకు యత్నించారని వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కురుమూర్తిని కలిశారు. నిందితులను పట్టుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. మట్ట వెంకటయ్యగౌడు, తిరుపతిరెడ్డి, వెంకటేష్, పాండు, రామస్వామి, యాదయ్య, శేఖర్, సంతోష్, శేఖర్, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మున్సిపాలిటీలో తైబజార్ వేలం



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను తైబజార్ వేలాన్ని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ నిర్వహించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వేలం పాటను నిర్వహించారు. వేలం పాటలో ఏడుగురు సభ్యులు పాల్గొనగా, వారిలో పట్టణానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ రూ.25.3 లక్షలకు వేలాన్ని దక్కించుకున్నారు. గతేడాది రూ.22.61 లక్షలకు పలికింది. మున్సిపల్ మేనేజర్ రాజకుమారి, ఆర్ఐ చంద్రయ్య, మున్సిపల్ సిబ్బంది, వేలం దారులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి, చెర్కూర్, బొల్లంపల్లి, చెదురుపల్లి, బండోనిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో సమీప వ్యవసాయ పొలాలకు వెళ్లి అక్కడి వంటవార్పు చేశారు. పాడిపంటలు, పశుసందను కాపాడాలని వేడుకుంటు దేవుళ్లకు నైవేద్యం సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు సహపంక్తి భోజనాలు చేశారు.

స్పోర్ట్స్ స్టేడియం మంజూరుపై హర్షం

మన్ననూర్: అమ్రాబాద్, పదర మండలాలకు ఒక్కో స్పోర్ట్స్ స్టేడియం మంజూరు కావడంతో మండలంలోని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా క్రీడారంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేక యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పోర్ట్స్ స్టేడియం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



మోడల్‌హైస్కూల్‌లో పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

వెల్దండ: పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తునట్లు జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ హైస్కూల్ నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులను క్షణంగా తనిఖీ చేసి అనుమతించాలని సూచించారు. మోడల్ హైస్కూల్ 210 మంది విద్యార్థులకు వందశాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని 144 మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మొత్తం 10, 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 10, 535 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 25 మంది విద్యార్థులు గణిత పరీక్షలకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

వెల్దండ పోలీస్‌స్టేషన్‌లోని సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని 60పరీక్ష కేంద్రాల అధికారులతో ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు, పదవ తరగతి పరీక్షల జిల్లా పరిశీలకురాలు విజయలక్ష్మి మాట్లాడారు. జిల్లాలోని 60 పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై ఆమె దిశానిర్దేశం చేశారు. అనంతరం డీఈఓ పోలీస్‌స్టేషన్ నుంచి సెట్ 1 గణిత సబ్జెక్ట్ ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు భోజేశ్వర్, శ్రావణ్‌కుమార్, రవీందర్, రవికిరణ్ ఉన్నారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పది పరీక్ష కేంద్రాన్ని డీఈఓ రమేష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లకు, ఇన్విజిలేటర్లకు సూచించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

ఉప్పునుంతల: అనారోగ్యానికి గురైన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పునుంతల కేదారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి 101 కొబ్బెర కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా బల్మూరు మండలం జినుకుంట కనకాల మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేడమోని భాస్కర్, నాయకులు రామచంద్రయ్య, చిన్నజంగిరెడ్డి, రవీందర్, శ్రీనివాసులు, శేఖర్‌గౌడ్, రేణయ్య, అచ్యుతారెడ్డి, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..

మన్ననూర్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని బుధవారం పదర మండలం రాయలగండి చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైస్ మిల్లర్స్ డివిజన్ అధ్యక్షుడిగా బాలకృష్ణ



కల్వకుర్తి రూరల్: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా బీచని బాలకృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలో డివిజన్ పరిధిలోని మిల్లర్ల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో పాపిశెట్టి శ్రీనివాస్‌పై ఐదు ఓట్ల మెజార్టీతో బాలకృష్ణ గెలుపొందారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో బాలకృష్ణను సన్మానించి మిఠాయిలు తినిపించారు. గుబ్బ వెంకటేష్, గోపిరెడ్డి రామిరెడ్డి, పోలా విజయకుమార్, మాచిపెద్ది రామస్వామి, ఎన్మనగండ్ల రవి, రాజశేఖర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాస్ పేరుతో ప్రభుత్వం మోసం



పెంట్లవెల్లి: రాజీవ్ యువ వికాస్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర ఆరోపించారు. బుధవారం తహసీల్దార్ విజయసింహాకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న యువకులు మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి అవస్థలు పడుతున్నారన్నారు. రేషన్‌కార్డు నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, ఖలీల్, వెంకటేష్, కురుమూర్తి, బాలరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వనాల్లో ఎండుతున్న మొక్కలు



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలలో రూ.వేలు వెచ్చించి నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. సర్పంచ్ పదవి కాలం ముగియడంతో ప్రత్యేక పాలనలో గ్రామాలలో అభివృద్ధి కుంటుపడింది. పేరుకే ప్రత్యేక అధికారులు, గ్రామాలను సందర్శించిన పాపాన పోలేదు. గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. అధికారులు, పంచాయితీ కార్యదర్శులు వంతుకు గంతేసిన విధంగా పోవడం రావడం తప్ప ప్రకృతి వనాలలోని మొక్కలను రక్షించాలన్న ధ్యాసే లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలీలకు రవాణ చార్జీలు ఇవ్వాలి

తాడూరు: ఉపాధి కూలీలకు రవాణ చార్జీలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చర్లఇటిక్యాలలో 3 కి.మీ దూరంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పనిచేస్తున్న వారికి టెంట్, గ్రీన్ మ్యాట్, నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలపైన కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉపాధి పనులపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. ఏడాది 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజు కూలి రూ.800 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, కూలీలు అంజలి, లక్ష్మయ్య, లింగమ్మ, ప్రమీలమ్మ, హుస్సేన్ పాల్గొన్నారు.

రూ.46 లక్షలకు పశువుల సంత వేలం

తెలకపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పశువుల సంతకు అధికారులు వేలం పాట నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన మధుకర్‌రెడ్డి రూ.46.60 లక్షలకు పశువుల సంతను వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. తైబజార్‌ను బాలస్వామి గౌడ్ రూ.75,500 లకు వేలం పాట పాడారు. గ్రామ పంచాయతీ దుకాణం చోటేమియ రూ.29,100లకు వేలంపాటలో దక్కించుకున్నాడు. గ్రామ ప్రత్యేక అధికారి వెంకటయ్య, ఈఓ భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంత వేలాన్ని రద్దు చేయాలని వినతి

పశువుల సంత వేలాన్ని రద్దుచేయాలని యువకులు బారిగారి శివశంకర్, రెడ్డపాకుల మల్లేష్‌బాబులు ప్రత్యేక అధికారి వెంకటయ్య, ఈఓ భాస్కర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గత సంత్సరంకంటే రూ.20 లక్షలకు పైగా పశువుల సంతవేలం పాడారని దీంతో గ్రామ పంచాయతీకి నష్టం వచ్చిందని వివరించారు. రద్దు చేసేవరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన తోట శ్రీరాములుపై తమ్ముడు జంగయ్య దాడి చేశాడు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు జంగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా వ్యవసాయ పొలంలో శ్రీరాములు పనుల చేస్తుండగా తమ్ముడు దాడి చేయడంతో అన్నకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

కోడేరు: మండలంలోని నాగులపల్లి తండా శివారులో రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో మంటలు చెలరేగాయి. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 20 మంది రైతులు మోటార్లు బిగించుకున్నారు. బుధవారం ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి భారీ శబ్దం రావడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు.

